


ఘనంగా జపనీస్ డే

ఆకట్టుకున్న బంగారు వంతెన నాటిక



పుట్టపర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జపనీస్ డే వేడుకలను గురువారం సాయికుల్వంత సభామంటపంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జపనీస్ ప్రతినిధి జపాన్‌లో చేపట్టిన సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. సత్యసాయి బోధనలు, సేవలు తమకు మార్గదర్శకాలని, సత్యసాయిబాటలో పయనిస్తూ సామాజికసేవలను కొనసాగిస్తున్నామన్నారు. సత్యసాయి ప్రేమ తత్వం శాంతి జీవనానికి మార్గదర్శకమన్నారు. అనంతరం జపాన్ యువత బంగారు వంతెన పేరిట నాటికను ప్రదర్శించారు. నాటికలో రావణ బ్రహ్మ శివభక్తిని తెలియజేశారు. రామాయణంలోని పలు ఘట్టాలను వివరించారు. భక్తి గీతాలాపన చేపట్టారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.





పట్టా ఫట్..!

ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా పట్టాలు జారీ

- ఎన్నికల ముందు ఓ అధికారి నిర్వాకం
- రికార్డుల్లో లేవంటున్న ప్రస్తుత రెవెన్యూ అధికారులు
- రద్దు చేసేందుకు సన్నద్ధం

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఓ రెవెన్యూ అధికారి కొందరితో బేరం కుదుర్చుకుని గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ స్థలంలో పట్టాలు రాసిచ్చేశాడు. అయితే ఆ పట్టాలు పరిశీలించిన ప్రస్తుత రెవెన్యూ అధికారులు అవి రికార్డుల్లో లేవని చెప్పారు. దీంతో తాము ఆ రెవెన్యూ అధికారి మాటలు నమ్మి మోసపోయామని బాధితులు లబోదిబోమంటున్నారు.



పోతుకుంట వద్ద పట్టాలిచ్చిన ప్రభుత్వ స్థలం

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట వద్ద మామిళ్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పోలీస్ గెస్ట్‌హౌస్ వెనుక భాగాన సర్వేనెంబర్ 395(పీ), 396-1లో ఎకరాకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రాంతంలో సెంటు సుమారు రూ. 4లక్షల నుంచి రూ.5లక్షల వరకు పలుకుతోంది. ఎన్నికల ముందు ఓ రెవెన్యూ అధికారి ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుని వాటిని బేరంపెట్టి ఖర్చుల కింద లక్షలు వసూలు చేసుకుని, ఆ స్థలంలో లేఅవుట్ వేయించి, వాటిని దర్జాగా రాసిచ్చినట్లు తెలుస్తోంది. ఇలా పోతుకుంట, ధర్మవరం ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సుమారు 16 పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. వీటితో పాటు పట్టణంలోని 650 సర్వే నెంబర్‌లో ప్లంబర్ అసోయేషన్ ముసుగులో సుమారు 60మందికి పైగా పట్టాలు తీసుకున్నారు. ఈపట్టాలకు సంబంధించి వివరాలను రికార్డులో నమోదు చేయలేదు.

ఎలా బయటపడ్డాయంటే..

పోతుకుంట వద్ద ప్రభుత్వ స్థలంలో పట్టాలు పొందినవారు కొంత మంది ఆ స్థలంలో ఉన్న కంపచెట్లు తొలగించేందుకు వెళ్లారు. ఆ విష యాన్ని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు అక్కడికి వెళ్లి ఆ స్థలం ప్రభుత్వానిదని, ఎవరు మీకు పట్టాలు ఇచ్చారని, మీవద్ద ఏ ఆధారాలు ఉన్నా తీసుకురావాలని అక్కడున్న వారికి సూచించారు. దీంతో పోతుకుంటకు చెందిన కొంతమంది వారి వద్ద ఉన్న పట్టాలను జిరాక్స్ తీసుకుని అధికారులకు ఇచ్చారు. అయితే వాటిని అధికారులు రికార్డులు పరిశీలించారు. ఎక్కడా రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో ఆ విషయాన్ని లబ్ధిదారులకు చెప్పారు. మేమేమి చేసేది అప్పట్లో మాకు రెవెన్యూ అధికారులే తమకు ఇచ్చారని చెప్పారు.

పట్టాలు రద్దు చేసేందుకు చర్యలు..?

లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాలను రికార్డులో నమోదు చేయకపోవడంతో వారికి నోటీసులు ఇచ్చి రద్దు చేసేందుకు అధికారులు సన్నద్ధం అయినట్లు సమాచారం. ఇప్పటికే పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రభుత్వ స్థలంలో సుమారు 50 సెంట్లు వరకు 16మందికి పట్టాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. వాటిలో కూడా ఒకరికి రెండు సెంట్లు, మరొకరికి ఒకటిన్నర సెంట్లు ఇలా ఇష్టానుసారం ఇచ్చినట్లు తెలిపారు. రికార్డులో నమోదు చేయకపోవడం, ఆపై ఆ స్థలాల్లో లబ్ధిదారులు కూడా నివాసం లేకపో వడం వంటివి పరిగణలోకి తీసుకుని ఆ పట్టాలను రద్దు చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

రికార్డుల్లో లేవు



పోతుకుంట వద్ద ఉన్న 395, 396-1 సర్వే నెంబరు, పట్టణంలో ఉన్న 650 సర్వే నెంబర్లలో ఇచ్చిన పట్టాలు రికార్డులో నమోదు కాలేదు. ఆస్థలంలో పట్టాలు ఇచ్చారే గానీ రికార్డులో నమోదు చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిపై చర్యలు తీసుకుంటాం.

-నటరాజ, తహసీల్దార్, ధర్మవరం



రికార్డులో నమోదు చేయకనే ఇచ్చిన పట్టా

ఎన్నాళ్లు ఇలా..?

రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత.. కీలక మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీ

- డీటీలకే ఇన్‌చార్జి బాధ్యతల అప్పగింత
- పేరుకుపోతున్న రెవెన్యూ సమస్యలు





పుట్టపర్తి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలా మండలాల్లో రెగ్యులర్ తహసీల్దార్లు లేకపోవడంతో డిప్యూటీలతో నెట్టుకొస్తున్నారు. ఈనేపథ్యంలో కుప్పలు తెప్పలుగా భూ సమస్యలు పేరుకుపోతున్నాయి. జిల్లాలో కీలకమైన మండలాల్లో సైతం డిప్యూటీ తహసీల్దార్లతోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

డీటీలు, తహసీల్దార్లు వారే..

మండల రెవెన్యూ వ్యవస్థకు తహసీల్దార్లే కీలకం. జిల్లాలో 32 మండలాల్లో 13 రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా మొత్తమీద కలెక్టరేట్, డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లో 41 మంది తహసీల్దార్లు ఉండాల్సి ఉండగా 25 మంది మాత్రమే ఉన్నారు. ఈనేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో డీటీ పోస్టులు తగినన్ని లేకపోయిన 13 చోట్ల ఇన్‌చార్జి తహసీల్దార్లుగా బాధ్యతలు అప్పగించారు. ఆయా మండలాల్లో డీటీలు వారే తహసీల్దార్లు వారే. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసేది, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు వారు ఇచ్చే నివేదికలను మండల స్థాయిలో డీటీ పరిశీలించి పరిష్కారం ఎలా ఉండాలో సిఫారుసు చేస్తారు. ఆ తరువాత తహసీల్దార్ దాన్ని అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేస్తారు. ప్రసుత్తం ప్రజా సమస్యల పరిష్కారంలో తప్పనిసరిగా క్షేత్ర స్థాయి సిబ్బంది పాత్ర ఉంటుంది. ఈనేపథ్యంలో జిల్లాలో సగం మండలాల్లో డిప్యూటీలనే ఇన్‌చార్జి తహసీల్దార్లుగా పెట్టి నెట్టుకొస్తున్నా రు. పనిభారంతో డీటీలు ప్రజా సమస్యలు పరిష్కరింగలరా అంటూ పలువురు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు చిలమత్తూరు, రొద్దం, ముదిగుబ్బ, తాడిమర్రి, గాండ్లపెంట, ఎన్‌పీకుంట, అగళి, గుడిబండ, రొళ్ల, అమరాపురం, కనగానపల్లి, తలుపుల మండల రెవెన్యూ కార్యాలయాల్లో డీటీలే ఇన్‌చార్జ్ తహసీల్దార్లుగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్లుగా అదనపు బాధ్యతలు అప్పగించిన వారిలో చాలా మంది గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఉన్న వాళ్లే. వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఎక్కడంటే అక్కడ సంతకాలు పెట్టి దోచిపెట్టారు. అదే స్థాయిలో భూ సమస్యలు సృష్టించినట్లు తెలుస్తోంది. అందులో తహసీల్దార్లు, డీటీల పాత్ర ఉన్నట్లు బయటపడింది. రెవె న్యూ అక్రమాలలో జిల్లా టాప్‌లో నిలిచింది. ఈనేపథ్యంలో డీటీలే ఇన్‌చార్జి తహసీల్దార్లుగా ఉండటం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోవడంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం మళ్లీ మొదటికే వస్తుందని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు.

డీటీలే మేలనే నమ్మకం

రెగ్యులర్ తహసీల్దార్ల కంటే డీటీలే చెప్పిన పని బాగా చేస్తారని రాజకీయ నాయకులకు నమ్మకం. అందుకే మండల రెవెన్యూ కార్యాలయాల్లో రెగ్యులర్ తహసీల్దార్లకు బదులుగా డీటీకే ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని జిల్లా అధికార యంత్రాంగంపై నేతలు ఒత్తిళ్లు తెచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వంలో 17 మండలాలకు డీటీలు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా పనిచేశారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన సాధారణ బదిలీల్లో తహసీల్దార్ పోస్టులకంటే తమకు అనుకూలమైన డిప్యూటీ తహసీల్దార్లను నియమించుకోవడంపైనే ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపారు. సిఫార్సులతో పోస్టింగ్ వేయించుకుని డీటీలకే తహసీల్దార్ బాధ్యతలు ఇప్పించి, కొనసాగే అవకాశం కల్పించారు. ఈనేపథ్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని పక్కన పెట్టిన కొందరు టీడీలు ఇష్టారాజ్యంగా భూముల సమస్యలు తెచ్చి ఒకరి భూమి మరొకరికి చేసి వివాదాలు సృష్టించిన వైనాలు జిల్లాలో పలు మండలాల్లో వెలుగుచూశాయి. ఇదే కోవలో చిలమత్తూరు డిప్యూటీ తహసీల్దార్ యూనస్‌బాబు సస్పెన్షన్‌కు గురయ్యారు. రెవెన్యూ సదస్సులతోపాటు ప్రజా ఫిర్యాదుల వేదికల్లో వచ్చిన సమస్యల్లో చాలా వాటికి పరిష్కారం చూపామని రెవెన్యూ శాఖ చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవే మళ్లీ మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి. భూవివాదాల వల్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన నెలకొన్న సందర్భంలో మండల రెవెన్యూలో కీలకమైన తహసీల్దార్ పోస్టులు భర్తీచేయకుండా డిప్యూటీ తహసీల్దాలకు ఒక్కొక్కరికి రెండు బాధ్యతలు ఇస్తే ఫిర్యాదుల్ని పరిష్కారం సాధ్యమేనా అనే చర్చ నడుస్తోంది.

భూసేకరణ పనులు పూర్తి చేయాలి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణం కోసం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూ సేకరణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో గురువారం నేషనల్ హైవే 342, 716జీ రోడ్లకు సంబంధించి భూ సేకరణ పనుల పురోగతిపై జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలన్నారు. జిల్లాలోని పెడబల్లి, కప్పలబండ గ్రామాల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు జాతీయ రహదారుల అధికారుల సమన్వయంతో సమస్యలు తలెత్తకుండా భూసేకరణ చేపట్టాలన్నారు. కుటాగుళ్ల ఆర్వోబీ, గోరంట్ల, కొత్తపల్లి, హిందూపురం, తదితర ప్రాంతాల్లో పలు భూసేకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు అశోక్‌కుమార్, మల్లికార్జునరావు, నాగరాజు, సుజాత, గిడ్డయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వేమన ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



కటారుపల్లి ఆలయం బయట స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

గాండ్లపెంట, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి గ్రామంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో వేమన ఉత్సవాలు జరగనున్నాయి. ఈఏర్పాట్లను డీఎస్పీ శివనారాయణస్వామి గురువారం పరిశీలించారు. వేమన ఆలయ ఆవరణం, ఆలయం బయట దుకాణాలు, సంస్కృతిక కార్యక్రమాలకు స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని వేమన ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆయనతోపాటు సీఐ నాగేంద్ర, ఆయల కమిటీ సభ్యులు నందవేమారెడ్డి, వేమారెడ్డి, పలువురు ప్రజలున్నారు.

మూల్యాంకనం జాగ్రత్తగా చేయండి



స్పాట్ వాల్యూషన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం(స్పాట్ వాల్యూషన్) చేసే ఉపాధ్యాయులు పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా ఉండాలని డీఈఓ కిష్టప్ప సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో పదో తరగతి మూల్యాంకనాన్ని గురువారం ప్రారంభించారు. తొలి రోజు రెగ్యులర్ ఆరు వేల పేపర్లు, ఓపెన్ స్కూల్ 850 పేపర్లను మూల్యాంకనం చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏడీ-2 రామకృష్ణ, సీసీ సాయినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోపు కుట్రలకు బలికావద్దు

పబ్బం కోసం ఫ్యాక్షన్ ఊబిలోకి లాగుతున్నారు

గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత వినతి

- పదవులకు మీరు.. గొడవలకు బీసీలా..?
- తోపుదుర్తి సోదరులపై మండిపాటు



అనంతపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో తోపుదుర్తి సోదరులు మళ్లీ కక్షలు రేపాలని చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు మద్దలచెరువు గంగుల కుటుంబం, కనుముక్కల సానె కుటుంబాన్ని గొడవల్లోకి లాగుతున్నారని ఆరోపించారు. వారి కుట్రలకు బలికావొద్దని గంగుల, సానె కుటుంబాలకు పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లికి జగన్ వస్తున్న క్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా (మిగతా 6లో....)

అన్నదాతల్లో ఆశలు



కాలువలో పెరిగిన ముళ్లకంపలు

- టీడీపీ పాలనలో మాల్యం బ్రాంచి కాలువ నిర్మాణం
- అప్పట్లో నీరు కూడా విడుదల
- వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
- నీరు వదల్లేదు.. నిధులూ ఇవ్వలేదు..
- కొత్త ప్రభుత్వం నిధుల కేటాయింపుతో చిగురించిన ఆశలు (వివరాలు 6లో..)



ఆన్‌లైన్‌లోనే..!

వైసీపీ పాపం.. రైతులకు శాపం..

సాగులో ఉన్నా.. ఆన్‌లైన్‌లో భూముల తొలగింపు

కొత్త ప్రభుత్వంలో పరిష్కారానికి చర్యలు

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ

వంద రోజులైనా పరిష్కారం ఏదీ?

అసైన్మెంట్ కమిటీ పేరుతో కాలయాపన

కూడేరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆ భూములు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించాలంటూ బ్యాంకులు ఒత్తిడి తెస్తున్నాయి. భూములు కోల్పోయి, రుణాలు తిరిగి చెల్లించలేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది ఏర్పాటైన కొత్త ప్రభుత్వం.. వైసీపీ భూఅరాచకాలపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూసమస్యలపై అర్జీలు స్వీకరించారు.

మండలంలో 202 మంది రైతుల భూములను ఆన్‌లైన్ నుంచి అన్యాయంగా తొలగించారని అధికారులు క్షేత్రస్థాయి విచారణ ద్వారా తేల్చారు. వాటికి వంద రోజుల్లోగా అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంది. అర్జీలు స్వీకరించి, వంద రోజులు దాటినా నేటికీ అర్హులుగా గుర్తించిన రైతుల భూములను ఆన్‌లైన్ చేయలేదు. అదేమిటంటే అసైన్మెంట్ కమిటీ అంటూ కాలయాపన చేస్తున్నారు. దీనిపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంకా ఎన్నాళ్లు అధికారుల చుట్టూ తిరగాలనీ, ఎన్నేళ్లు వేచి చూడాలని వాపోతున్నారు.

ఏకపక్షంగా తొలగింపు

కాంగ్రెస్ హయాంలో భూమిలేని పేదలను గుర్తించి, అసైన్మెంట్ కమిటీ ఆమోదంతో భూములు పంచి, పాసుపుస్తకాలు సైతం మంజూరు చేశారు. అప్పట్నుంచి ఆ భూములను ఏళ్లుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో 2020లో కనీస విచారణ కూడా చేయకుండా అసైన్మెంట్ కమిటీ పంచిన భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. తమ భూములను తిరిగి ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.., ఆందోళనలు చేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో గతేడాది కొలువుదీరిన కొత్త ప్రభుత్వం భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల ద్వారా అర్జీలు స్వీకరించి, వంద రోజుల్లో పరిష్కారం చూపాలని ఆదేశించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారులు 242 అర్జీలను స్వీకరించారు. వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి 202 మంది రైతులను అర్హులుగా గుర్తించి, నివేదికలు తయారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపారు. అర్జీలు ఇచ్చి వంద రోజులు దాటినా భూసమస్యలు పరిష్కారం కాలేదు. నేటికీ భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించలేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది.



ఉదిరిపికొండ గ్రామం వద్ద చీనీ సాగు చేస్తున్న భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్ బాషా

రుణాలు చెల్లించ లేక..

భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు కొత్త సమస్య వచ్చిపడింది. వాటిపై తీసుకున్న రుణాలు మొత్తం చెల్లించాలంటూ బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలని వారు వాపోతున్నారు. అర్హులను తేల్చిని వారి భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ తీర్మానం అవసరమని అధికారులు చెబుతున్నారు. కమిటీ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో, ఎప్పుడు ఆన్‌లైన్ చేస్తారోనని రైతులు నిట్టూరుస్తున్నారు.



ఉదిరిపికొండ గ్రామం వద్ద వేరుశనగ సాగు భూమిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్

ఎన్నిసార్లు తిరిగినా...



నా భార్య మునెమ్మ పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. కాంగ్రెస్ పాలనలో నాలుగో విడత అసైన్మెంట్ కమిటీలో పట్టాతోపాటు పాసుపుస్తకం ఇచ్చారు. అలాంటి భూమిని విచారణ చేయకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. మూడు నెలల క్రితం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాం. వంద రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇంతవరకు కాలేదు.

- రామాంజనేయులు, రైతు, కూడేరు

నోటీసులు కూడా ఇవ్వకుండా..



నా పేరున ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో చీనీ సాగు చేస్తున్నాం. ఏళ్లుగా సాగులో ఉన్న భూమిని నోటీసులు కూడా ఇవ్వకుండా ఆన్‌లైన్ నుంచి తొలగించారు. బ్యాంకులో తీసుకున్న రుణాన్ని బయటి వ్యక్తుల వద్ద అప్పు చేసి, చెల్లించాం. గ్రామంలో పలుసార్లు జరిగిన సభల్లో అర్జీలు ఇచ్చాం. ఇప్పటికైనా అధికారులు భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని వేడుకుంటున్నా.

- పార్వతి, మహిళారైతు, ఉదిరిపికొండ గ్రామం

అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాకే..



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయి విచారణ చేశాం. సాగులో ఉండి ఆన్‌లైన్‌లో తొలగించిన భూములను గుర్తించి, నివేదికలు తయారు చేశాం. అర్హులైన రైతుల భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలంటే అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందాలి. ప్రభుత్వం కమిటీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. అసైన్మెంట్ కమిటీ ఆమోదం పొందిన వెంటనే అర్హులైన రైతుల భూములు ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తాం.

- మహబూబ్ బాషా, తహసీల్దార్, కూడేరు

పెన్షన్ రూల్స్ సవరణను వెంటనే విరమించాలి

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్



బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతిపత్రం అందజేస్తున్న ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెన్షన్ రూల్స్ సవరణ ను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించాలని ఆల్ ఇండియా బీఎస్ ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ అండ్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించా రు. ఈకార్యక్రమానికి ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ 8వ వేతన సవరణ సంఘంలో బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల రివిజన్ అంశం పాయింట్ ఆఫ్ రిఫరెన్స్‌గా చేర్చాలన్నారు. ఈ పెన్షన్ రూల్స్ వల్ల భవిష్యత్తులో పే కమిషన్ల వల్ల వచ్చే పెన్షన్ రివిజన్ పాత పెన్షనర్స్‌కు వర్తించకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సవరణను దేశవ్యాప్తంగా వ్యతిరేకించినట్లు వెల్లడించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ జీఎం ముజీబ్ పాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబుళు, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, సర్కిల్ సహాయ కార్యదర్శి సుభాన్, బ్రాంచ్ కార్యదర్శి బాలరంగయ్య, కుమార్, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, జిల్లా కార్యదర్శి జయరామప్ప వివిధ శాఖల పెన్షనర్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల సబ్సిడీ ధరలను ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి గురువారం ఉత్తర్వులు అందాయి. మూడు రకాల విత్తనాలకు 50 శాతం సబ్సిడీని వర్తింజేశారు. జీలుగ క్వింటా పూర్తి ధర రూ.12300లు కాగా ఇందులో 50 శాతం సబ్సిడీపోను రైతు రూ.6150లుగా చెల్లించాల్సి ఉంటుంది. జనుము క్వింటా పూర్తి ధర రూ.10900లు కాగా ఇందులో సబ్సిడీ పోను రైతు రూ.5450లు చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా ధర రూ.18000లు కాగా సబ్సిడీ పోను రైతు రూ.9వేలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాకు ఈ సారి జీలుగ 190 క్వింటాళ్లు, పిల్లిపెసర 15 క్వింటాళ్లు, జనుము 2 క్వింటాళ్లు కేటాయించారు.

తోపు కుట్రలకు బలికావద్దు

(5వ పేజీ తరువాయి)

స్పందించారు. ఫ్యాక్షన్ కారణంగా తన భర్త పరిటాల రవి, మామ, మరిదిని కోల్పోయామని, సానె కుటుంబంలో వారి తండ్రి, సోదరులను కోల్పోయి ఉమ ఒంటరిగా మారిపోయారని అన్నారు. గంగుల కుటుంబంలోనూ భానుమతి ఒంటరిగా మిగిలారని అన్నారు. ఫ్యాక్షన్ కారణంగా కుటుంబ సభ్యులను కోల్పోయి, పిల్లలను పోషించడానికి, చదివించేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని అన్నారు. ఒక పూట తినీ తినక నాలుగు గోడల మధ్య ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. 'మీ కుటుంబంలో ఎవరినైనా కోల్పోతే ఇలాంటి బాధలు ఎలా ఉంటాయో తెలుస్తాయి' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి అన్నారు. ప్రశాంతంగా ఉన్న సమయంలో మళ్లీ గంగుల, సానె కుటుంబాలను మధ్యలోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల, సానె కుటుంబాల మీద తోపుదుర్తి సోదరులకు అంత ప్రేమే ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఏదైనా ఒక మంచి పదవి ఎందుకు ఇప్పించలేదని నిలదీశారు. ఇప్పుడైనా ఆ రెండు కుటుంబాలకు న్యాయం చేయగలరా..? ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించగలరా అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని నిలదీశారు. చేతనైతే 2029 ఎన్నికల్లో రాప్తాడు టిక్కెట్‌ను గంగుల లేదా సానె కుటుంబాలకు ఇప్పించాలని సూచించారు. కక్షలకు వారు, పదవులకు మీరా అని నిలదీశారు. మహిళలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పరిటాల కుటుంబం మొదటి నుంచి రెడ్డి సామాజిక వర్గంతో సఖ్యతగా ఉందని, వారికి పరిటాల కుటుంబం వ్యతిరేకమన్నట్లు తోపు సోదరులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన భర్త హయాంలోనే రెడ్డి కులస్థులతో తమ కుటుంబానికి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. '2019 ఎన్నికలకు ముందు మీ గెలుపు కోసం రెడ్డి సామాజికవర్గ ప్రజలు సొంత ఆస్తులు అమ్మి పనిచేశారు. అధికారంలోకి వచ్చాక వారినే ఇబ్బంది పెట్టారు. అందుకే వారు మీకు దూరమయ్యారు. మళ్లీ దగ్గర చేసుకునేందుకు పరిటాల కుటుంబాన్ని వాడుకుంటున్నారు' అని విమర్శించారు. వారిని నమ్మవద్దని రెడ్డి సామాజికవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తోపుదుర్తి చందు హైదరాబాదు నుంచి వచ్చేటప్పుడు కొందరు రెడ్డి సామాజికవర్గ పిల్లలకు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపి, మద్యం తాపించి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా ఏవైనా గొడవలు జరిగితే పరిటాల కుటుంబంపై ఆరోపనలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌పై చేసిన వ్యాఖ్యలకు తోపుదుర్తి చందును తుక్కుతుక్కుగా కొట్టాల్సిందని విరుచుకుపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తోపుదుర్తి చందు తిట్టిన వీడియోలను ఆమె మీడియా ఎదుట ప్రదర్శించారు. 'మొద్దుశీను బతికిఉంటే నువ్వు పాదయాత్ర చేసేవాడివా?' అంటూ చందు చేసిన వ్యాఖ్యలను చూపించారు. అప్పట్లో దూషించి.. ఇప్పుడు చంద్రబాబు గారు... లోకేష్ గారని మర్యాద ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో టీడీపీవారు ఇలాంటి మాటలు మాట్లాడి ఉండే మీరు ఏం చేసేవారో ప్రజలందరికి తెలుసునని అన్నారు.

ఆపే శక్తి మీకు లేదు..

'రామగిరి ఎంపీపీ స్థానాన్ని మేము కావాలనుకుంటే ఆపే శక్తి మీకు లేదు' అని తోపుదుర్తి సోదరులనుద్దేశించి పరిటాల సునీత అన్నారు. అప్పట్లో చంద్రబాబు వద్దన్నందుకే తాము పోటీ చేయలేదని, లేదంటే ఆరు మండలాల ఎంపీపీ స్థానాలను గెలిచేవారమని అన్నారు. 'మీరు హైదరాబాదులో విలాసవంతంగా ఉండాలి. గొడవలకు బీసీలు వెళ్లాలా..?' అని నిలదీశారు. రాష్ట్రంలో అన్ని ఎంపీపీ స్థానాలను గెలిచామని గొప్పలు పోయే జగన్.. రామగిరిలో బలమున్నా గెలిపించుకోలేని దద్దమ్మ ఉన్నాడని గుర్తిస్తే మంచిదని అన్నారు. 'పాపిరెడ్డి పల్లిలో మీ పార్టీ నేత చనిపోతే ఎవరైనా పరామర్శించారా?' అని ప్రకాష్‌రెడ్డి అని ఆమె ప్రశ్నించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ఎస్ఐ సుధాకర్‌యాదవ్ విధులు నిర్వర్తిస్తే ఆయనను కించపరుస్తున్నారని, తప్పు చేసిన వారిని స్టేషన్‌కు పిలిపిస్తే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతారా అని మండిపడ్డారు. ఎంపీటీసీల చేత తనతో ఫోన్‌లో మాట్లాడించారని ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. చేతనైతే నిరూపించాలని సవాలు విసిరారు.

కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరు..?



తోపు సోదరులు ఎప్పుడూ టీవీ బాంబు గురించే ప్రస్తావిస్తుంటారని, కారు బాంబు గురించి ఎందుకు మాట్లాడరని పరిటాల సునీత నిలదీశారు. కారు బాంబుతో 24 మందిని పొట్టనపెట్టుకున్నది వాస్తవం కాదా ప్రశ్నించారు. అందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని, ఈ సంఘటనలో తోపు సోదరులు జైలుకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. పాపంపేటలో ఇళ్ల కూల్చివేత వెనుక పరిటాల కుటుంబం హస్తం ఉందని ప్రకాష్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆమె ఘాటుగా స్పందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారని, ఇందులో ఎక్కడా రాజకీయ నాయకుల ప్రమేయం లేదని అన్నారు. ఇళ్ల కూల్చివేతను మొదట అడ్డుకున్నది తమ పార్టీ నాయకులేనని అన్నారు. ఆ సమయంలో ప్రకాష్‌రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. మూడు రోజుల తరువాత రాజకీయం చేశారని మండిపడ్డారు. తాను రూ.8 కోట్లు తీసుకుని అక్కడ భవనాలు కట్టాలని చూస్తున్నానని ఆరోపించారని, దమ్ముంటే నిరూపించాలని ఆమె సవాల్ విసిరారు. జేసీబీలకు రాప్తాడు నియోజకవర్గ ప్రజలు భయపడరని, తోపుదుర్తి సోదరులు మాత్రమే భయపడతారని అన్నారు. తాను కూల్చాలనుకుంటే హైదరాబాదులోని తోపుదుర్తి సోదరుల బంగ్లాను కూలుస్తానని అన్నారు. ఇల్లు లేదు.. అద్దె ఇంట్లో ఉన్నామంటూ దొంగ ఏడుపులు ఏడ్చే ప్రకాష్‌రెడ్డి సోదరులకు హైదరాబాదులో భవనాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. లేనప్పుడు మరోలా వ్యవహరించే పద్ధతి పరిటాల కుటుంబానిది కాదని అన్నారు. పరిటాల కుటుంబం ఇచ్చే కుటుంబమే తప్ప.. తీసుకునే కుటుంబం కాదని ఆమె స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించండి

డీడీ రామనాథం ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లను స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టరు రామనాథం ఆదేశించారు. జిల్లాకేంద్రంలో ఉమ్మడి జిల్లా సబ్‌యూనిట్ ఆఫీసర్లతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌యూనిట్ ఆఫీసర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. చాలామంది క్షేత్రస్థాయిలో తిరగకుండా సొంత వ్యవహారాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తిరుగుతూ అన్నిశాఖలతో సమన్వయం చేసుకొని సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టరు ఓబులు, డిప్యూటీ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాల మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆశలు..!

టీడీపీ పాలనలో మాల్యం బ్రాంచి కాలువ నిర్మాణం.. అప్పట్లో నీరు కూడా విడుదల

వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం

నీరు వదల్లేదు.. నిధులూ ఇవ్వలేదు..

కొత్త ప్రభుత్వం నిధుల కేటాయింపుతో చిగురించిన ఆశలు



కాలువలో పెరిగిన ముళ్ల పొదలు



2018లో కాలువలో ప్రవహిస్తున్న నీరు

కణేకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతల ఆశలపై నీళ్లు కుమ్మరించారు. మాల్యం బ్రాంచి కాలువే అందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో కాలువను నిర్మించారు. 2018లో నీరు కూడా వదిలారు. కాలువ పక్కనే పొలాలున్న రైతులు పంటలు పండించుకున్నారు. పిల్ల కాలువలు తవ్వి పొలాలకు నీరందంచేందుకు చర్యలు చేపట్టారు. ఇంతలోనే 2019 ఎన్నికలొచ్చాయి. అప్పట్లో అధికారం చేపట్టిన వైసీపీ.. కాలువ పనులను అటకెక్కించింది. ఐదేళ్లలో పైసా కూడా నిధులివ్వలేదు. నీరు కూడా విడుదల చేయలేదు. తద్వారా రైతన్న ఆశలకు గండికొట్టారు. పిల్లకాలువల కోసం సేకరించిన భూములకు సంబంధించి కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో ఆరేళ్లుగా రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం హంద్రీనీవాకు నిధుల కేటాయింపుతో మళ్లీ అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. పిల్ల కాలువల నిర్మాణం చేపట్టి, పొలాలకు నీరు వదులుతారని రైతులు ఆనందపడుతున్నారు.

అప్పట్లో నీరు విడుదల

మండలంలోని హనకనహాళ్, సొల్లాపురం, మాల్యం, కళేకుర్తి, తుంబిగనూరు గ్రామాలకు సాగునీరు అందించేందుకు టీడీపీ హయాంలో కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) 36ఏ ప్యాకేజీ కింద మాల్యం బ్రాంచ్ కెనాల్ 21 కిలోమీటర్లు తవ్వారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలువకు నీరిచ్చేలా నిర్ణయించారు. ప్రధాన కాలువ నిర్మాణం 2018లో పూర్తయింది. దీని కింద దాదాపు 17 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అప్పట్లో కళేకుర్తి చెరువుతోపాటు కాలువ పక్కన పొలాలున్న రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారం కింద పప్పుశనగ పంట మాత్రమే సాగు చేసుకునే ఈ ప్రాంత రైతులు.. అప్పట్లో హంద్రీనీవా నీరు రావడంతో సంబరపడ్డారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు కూడా సాగు చేసుకున్నారు. పిల్లకాలువలు తవ్వి, పొలాలకు నీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ దిశగా అప్పట్లో చర్యలు చేపట్టారు. ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల మేర పరిహారంగా ప్రకటించారు. ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి, పిల్లకాలువలకు అవసరమైన దాదాపు 1500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో అనేక మందికి పరిహారం డబ్బు కూడా జమ చేశారు. మరో రూ.50 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండేది.

వైసీపీ నిర్లక్ష్యం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. మాల్యం బ్రాంచి కాలువను పూర్తిగా విస్మరించింది. కాలువకు నీరివ్వలేదు. దీంతో కాలువలో ముళ్లకంపలు పెరిగిపోయాయి. ప్రధాన, పిల్ల కాలువల పనులు ముందుకు కదలలేదు. కనీసం

మళ్లీ ఆశలు

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మాల్యం బ్రాంచి కెనాల్ పరిధిలోని రైతుల ఆశలు చిగురించాయి. ఇటీవల అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా పునరుద్ధరణకు రూ.రెండు వేల కోట్లు కేటాయించగా.. అందులో తమ ప్యాకేజీ డబ్బు కూడా వస్తాయన్న ఆశతో రైతులు ఉన్నారు. కాలువ పనులు పూర్తై నీరు వస్తుందని సంబరపడుతున్నారు. మళ్లీ పంటలు సాగుచేసుకునే రోజు వస్తుందని ఎదురుచూస్తున్నారు.

మోటార్లు పెట్టి నీటిని తోడుకున్నాం



హంద్రీనీవా ప్రధాన కాలువ పక్కనే మాకు 20 ఎకరాల పొలం ఉంది. 2018-19 సంవత్సరంలో కాలువకు వదిలిన నీటిని మోటార్ల ద్వారా తోడుకుని, పంటలు పండించుకున్నాం. ఆ తర్వాత నీరు వదలకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

-హరి, రైతు, మాల్యం

బకాయిలు చెల్లించాలి



హంద్రీనీవా పిల్ల కాలువలకు రెండెకరాలు ఇచ్చా. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షల మేర పరిహారం చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. ఆరేళ్ల కావస్తున్నా సొమ్ము అందలేదు. ఇప్పటికైనా రైతులకు బకాయిలు చెల్లిస్తే బాగుంటుంది.

-రజాక్, రైతు, మాల్యం

నూతన ప్రభుత్వంపై ఆశలు



వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నూతన ప్రభుత్వం ఆశలు రేపుతోంది. హంద్రీనీవాపై ఇప్పటికే మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పలుమార్లు అధికారులతో చర్చలు జరిపారు. కాలువకు నీరు వదలితే పంటలు పండించుకుంటాం.

- అశోక్, రైతు, మాల్యం

త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశం

త్వరలోనే హంద్రీనీవా కాలువకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేసి, నీరు విడుదల చేస్తాం. బడ్జెట్‌లో హంద్రీనీవాకు సంబంధించి రైతులకు బకాయి పడ్డ భూసేకరణ సొమ్ము అందించడంతోపాటు కాలువ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు కూడా పూర్తి చేసే అవకాశం ఉంది.

-శ్రీనివాసనాయక్, హంద్రీనీవా ఈఈ

గాలివాన బీభత్సం

కూలిన గోడలు.. విరిగిన చెట్లు
విద్యుత్ సరఫరాకు అంతరాయం
పిడుగుపాటుకు మహిళ మృతి
అనంత రోడ్లను ముంచెత్తిన మురుగునీరు


వర్షపు నీటితో అనంత ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం

అనంతపురం అర్బన్/రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బుధ, గురువారాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం నగరంలో సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఆ పాటి నీటికే రహదారులు, వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరింది. రామ్‌నగర్, గుల్జార్ పేట, రాజు రోడ్డు, సప్తగిరి సర్కిల్‌లో రోడ్లు మడుగులను తలపించాయి. ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నీరు నిలిచింది. బొమ్మనహాళ్, రామగిరి, కొత్తచెరువు, బెళుగుప్ప, ఉరవకొండ మండలాల్లో జల్లులు పడ్డాయి. డి.హీరేహాళ్ మండలంలో బుధవారం 10 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో 4.2, బ్రహ్మసముద్రంలో 3.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● గుంతకల్లు మండలం కదిరిపల్లికి చెందిన బుట్ట ఇంద్రజ(24) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందారు. భర్త వెంటకరమణతో కలిసి వేరుశనగ పొలంలో పనులు చేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీచాయి. ఇదే సమయంలో పిడుగు పడటంతో ఇంద్రజ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పొలానికి వెళ్లి బోరున విలపించారు. ఇంద్రజకు రెండేళ్ల క్రితం వెంకటరమణతో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసుగల కూతురు ఉంది. ఈ సమాచారాన్ని తహసీల్దారుకు తెలియజేశారు.


ఇంద్రజ (ఫైల్)


నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద..


రామగిరి వీధుల్లో పారుతున్న వర్షపు నీరు

● బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట, సింగానహళ్లి, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ తదితర గ్రామాలలో బుధవారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. భారీ ఈదురుగాలులు వీచాయి. దీంతో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఏఈ లక్ష్మీరెడ్డి సిబ్బందితో కలిసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

● రామగిరి మండలం గరిమేకలపల్లి, ఎంసీ పల్లి, మంగాపురం, పేరూరు తదితర గ్రామాలలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రామగిరి, కొత్తపల్లి, చెర్లోపల్లిలలో జల్లులు పడ్డాయి. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. తొలగించిన వేరుశనగ పంట తడిసిపోయింది.

● పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో గురువారం పలుచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు చల్లటి వాతావరణంలో సేదతీరారు. పుట్టపర్తిలో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కదిరి, బత్తలపల్లి, ధర్మవరం, గోరంట్ల, తాడిమర్రిలో చిరుజల్లులు పడ్డాయి. పుట్టపర్తిలో గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదైంది. కదిరిలో 32 డిగ్రీలు, 23 డిగ్రీలు, ధర్మవరంలో 32 డిగ్రీలు, 24 డిగ్రీలు, హిందూపురంలో 31 డిగ్రీలు, 23 డిగ్రీలు, పెనుకొండలో 32.0 డిగ్రీలు, 23 డిగ్రీల గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి


పాపంపేటలో పడిపోయిన షాపింగ్ మాల్ గోడ

● వర్షం కారణంగా అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం సాయంత్రం నుంచి నిలిచిపోయింది. రాప్తాడు, అనంతపురం రూరల్, గార్లదిన్నె, కూడేరు, శింగమల తదితర ప్రాంతాల్లో ఈదురుగాలు వీయడంతో చెట్లు నేలకొరిగాయి. కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయి. అనంతపురం నగరంలోని ఎర్రనేల కొట్టాలలో చెట్టువిరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

కూలిన గోడలు


చంద్ర ఆసుపత్రి సమీప నిర్మాణంలో ఏడో అంతస్తు గోడ కూలిన దృశ్యం

● అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాపంపేటలో ఓ షామింగ్ మాల్ గోడ కూలింది. ఆ సమయంలో వర్షం కారణంగా అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పాపంపేట సర్కిల్‌లో ఓ షాపింగ్ మాల్‌ను కొత్తగా ప్రారంభించారు. దాని వెనుక భాగంలోని రెండో అంతస్తులో నిర్మాణ దశలో ఉన్న గోడ కూలింది. సిమెంట్ పెల్లలు విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు కూలిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి ఎనిమిది గంటల వరకూ చీకట్లో గడపాల్సి రావడంతో షాపింగ్ మాల్ నిర్వాహకులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోడ నిర్మాణంలో నాణ్యత పాటించని కారణంగా ఇలా జరిగిందని ఆరోపించారు. లైట్ వెయిట్ బ్రిక్స్ కావడంతో గాలికి గోడ కూలిపోయిందని అంటున్నారు. నిర్మాణ దశలో ఉన్న భవంతిలో షాపింగ్ మాల్‌ను ఎలా ప్రారంభిస్తారని మండిపడ్డారు.


అనంతపురంలోని రాంనగర్‌లో రోడ్డుపై వర్షపు నీరు

● అనంతపురం నగరంలోని చంద్ర హాస్పిటల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవంతి గోడ కూలిపోయింది. ఏడో అంతస్తుపై నుంచి గోడ కూలడంతో కింద ఉన్న వాహనాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వానకు తడిసిన మద్యం బాక్సులు

అనంతపురం నగరంలోని ఐఎంఎల్ డిపో ఆవరణలో మద్యం బాక్సులు వర్షంలో తడిసిపోయాయి. మద్యం దుకాణాలను తరలించేందుకు వాహనాల్లోకి చేరుస్తుంగా వర్షం కురిసింది. దీంతో బాక్సులు తడిసిపోయాయి. వాహనాల్లోని టార్పలిన్‌లతో కప్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మద్యం బాటిళ్లపై ధరల స్టిక్కర్లు తొలగిపోయాయి. వాటిని విక్రయించేందుకు సమస్యలు తలెత్తుతాయని, తడిసిన బాక్సులకు బదులుగా ఇతర బాక్సులు ఇవ్వాలని పలువురు వ్యాపారులు కోరారు. అయినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాక్సులు తడిసిన మాట వాస్తవమేనని, ధరల స్టిక్కర్లు తొలగిపోయిన విషయం తమ దృష్టికి రాలేదని సంబంధిత అధికారి అన్నారు.


తడిసిపోయిన మద్యం బాక్సులు

నీట మునిగిన ఆశాదీపాలు

వేర్వేరుచోట్ల ఈతకెళ్లి ఇద్దరు బాలుర మృతి

కన్నీటి పర్యంతమైన కుటుంబీకులు


సంజయ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల గురువారం నీటమునిగి ఇద్దరు బాలురు మృతిచెంది, వారి కుటుంబాల్లో కన్నీళ్లు నింపారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన విద్యార్థి సంజయ్‌కుమార్ (13) చెరువులోకి ఈతకెళ్లి మరణించాడు. పట్టణంలోని వడ్డే బండ వీధికి చెందిన గోవిందరాజులు, లలితమ్మ దంపతుల కుమారుడు సంజయ్‌కుమార్ ఏడో తరగతి చదువుతుం డేవాడు. గురువారం పాఠశాలకు వెళ్లలేదు. స్నేహితులతో కలిసి పట్టణ చివరలో ఉన్న ఊరి చెరువు వద్దకు ఈతకెళ్లాడు. చెరువులోకి దిగిన సంజయ్‌కుమార్ నీట మునుగుతుండడంతో స్నేహితులు భయంతో పరుగులు తీశారు. అటుగా వెళ్తున్న ఆటోడ్రైవర్ గమనించి, వెంటనే సంజయ్‌కుమార్‌ను బయటకు తీసి, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు, బంధువులు.. ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై పట్టణ దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మునిగి..


హరినాథ్‌రెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.రామరాజుపల్లి సమీపంలోని బెంచి కాలువలో మునిగి హరినాథ్ రెడ్డి (14) అనే బాలుడు మృతిచెందాడు. దిమ్మగుడి గ్రామానికి చెందిన ఓబులేరెడ్డి, నాగవేణి దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. దిమ్మగుడిలో ఉన్న ఎకరా పొలంలో పనులు చేసేందుక కుమారుడు హరినాథ్ రెడ్డిని పంపారు. పొలం సమీపంలో ఉన్న బెంచి కాలువలోకి స్నేహితులతో కలిసి హరినాథ్ రెడ్డి ఈతకెళ్లాడు. ఈత సరిగా రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అతడు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్నేహితులు గమనించి, గ్రామంలోని ప్రజలకు సమాచారం అందించారు. వారు వచ్చి బాలుడిని బయటకు తీయగా.. అప్పటికే మృతిచెందాడు. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి పెల్లెలు పడి యువకుడు..


హేమంత్‌కుమార్ (ఫైల్)

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలోని పెద్దిరెడ్డిపల్లి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తుండగా మట్టి పెల్లలు పడి గురువారం ఓ యువకుడు దుర్మరణం చెందాడు. హిందూపురం వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన మేరకు పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన శివలింగప్ప కుమారుడు హేమంత్‌కుమార్ (29) తన సొంత ట్రాక్టర్ తీసుకెళ్లి ఇసుక కోసం మట్టి పెల్లలు తొలగిస్తున్న సమయంలో అవి మీదపడ్డాయి. దీంతో హేమంత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలో ఉన్నవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మట్టి పెల్లలు తొలగించే సమయానికి ప్రాణాలు విడిచాడు. రూరల్ పోలీసులు సంఘట నా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రాత్రైనా పోస్టుమార్టం నిర్వహించక పోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి గేటు ఎదురుగా రహదారిపై ఆందోళన చేశారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అక్కడికి వెళ్లి బాధితులకు సర్ది చెప్పి వైద్యులను సంప్రదించి వెంటనే పోస్టుమార్టం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ప్రాణం పోయినా పట్టించుకోరా..?

15 రోజుల క్రితం

విద్యుత్ ప్రమాదంలో లైన్‌మన్‌కు గాయాలు

చికిత్స పొందుతూ మృతి

అధికారుల నిర్లక్ష్యంపై కుటుంబీకుల ఆగ్రహం

న్యాయం చేసే వరకు శవాన్ని తీసేది లేదంటూ స్పష్టం

ఉన్నతాధికారుల హామీతో ఎట్టకేలకు ఖననం


డీఈఈ భూపతిని నిలదీస్తున్న మృతుడి బంధువులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లైన్‌మన్ రామచంద్రారెడ్డి 15 రోజుల క్రితం విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, మరణించినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు శవాన్ని ఖననం చేసేదిలేదంటూ భీష్మించారు. ఉన్నతాధికారుల హామీతో ఎట్టకేలకు గురువారం సాయంత్రం ఖననం చేశారు. పట్టణ పరిధి చౌడేశ్వరీ కాలనీకి చెందిన లైన్‌మన్ రామచంద్రారెడ్డి సోమందేపల్లిలో విధులు నిర్వర్తిస్తుండేవారు. గతనెల 19వ తేదీ ఉదయం సోమందేపల్లిలో విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ.. రామచంద్రారెడ్డిని పిలిపించుకున్నాడు. ఎల్‌సీ తీసుకోకుండా ఒక లైన్ ఆఫ్ చేయించి రామకృష్ణ విద్యుత్ స్తంభం కింద ఉండి.. రామచంద్రారెడ్డిని పైకి ఎక్కించాడు. అతడు స్తంభం ఎక్కినపుడు విద్యుత్ సరఫరా లేదు. తరువాత ఉన్నఫలంగా విద్యుత్ సరఫరా కావడంతో రామచంద్రారెడ్డి స్తంభంపైనే విలవిల్లాడాడు. లైన్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. గాయపడిన రామచంద్రారెడ్డిని బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 2వ తేదీన అతడు మృతిచెందాడు. హిందూపురానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని ఖననం చేయమని రామచంద్రారెడ్డి కుటుంబీకులు తేల్చి చెప్పారు. దీంతో విద్యుత్ యూనియన్ల నేతలు, ఉన్నతాధికారులు.. వారి ఇంటికి చేరుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామనీ, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేంద్ర హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గురువారం సాయంత్రం రామచంద్రారెడ్డి మృతదేహాన్ని ఖననం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. సోమందేపల్లి ఏఈఈ పరమేశ్వర్ రెడ్డిని తప్పిస్తూ అగళికి బదిలీ చేయడంపై యూనియన్ నాయకులు మండిపడ్డారు. ఇదే విషయమై డీఈఈ భూపతిని నిలదీశారు. ఏఈఈపై చర్యలు తీసుకోకూడదంటూ ఓ మంత్రి నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వచ్చినట్లు చర్చ సాగుతోంది.

గంజాయి విక్రేతల అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెనుకొండ దర్గాకు వచ్చిపోయే ఫకీర్ల వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మహేష్ గురువారం వెల్లడించారు. హిందూపురం పట్టణం హస్నాబాద్‌కు చెందిన జాహిద్ అహ్మద్, మేళాపురం వాసి షేక్ తబ్రేజ్, నేతాజీనగర్‌కు చెందిన సాయివినయ్ అలియాస్ 999, అహ్మద్‌నగర్‌కు చెందిన ఇమ్రాన్ కలిసి పెనుకొండ దర్గాకు వచ్చి వెళ్లేవారు. ఈ సందర్భంలో పెనుకొండ దర్గాపేటకు చెందిన సయ్యద్‌బాబా ఫక్రుద్దీన్ పరిచయమయ్యాడు. దర్గాకు వచ్చిపోయే ఫకీర్ల వద్ద గంజాయి సేవించడం అలవాటుపడ్డారు. ఆ తరువాత ఓ ఫకీర్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, సేవిస్తూ దానిని హిందూపురంలోని కొంతమందికి విక్రయించేవారు. పోలీసులకు రాబడిన సమాచారంతో గురువారం కొడికొండ-శిర హైవేలోని బైలాంజనేయస్వామి ఆలయం వద్ద నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. సీఐలు ఆంజనేయులు, జనార్దన్, ఎస్‌ఐ శ్రీధర్ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్‌ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి రండి

గవర్నర్‌కు జేఎన్‌టీయూ వీసీ ఆహ్వానం


గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న వీసీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవానికి రావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం విజయవాడలో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అభివృద్ధి కార్యకలాపాలు, ఇంటర్నల్ రెవెన్యూ జనరేషన్, హరిత వాతావరణం, అధ్యాపకుల నియామకాలు తదితర అంశాలపై గవర్నర్ ఆరా తీశారని వీసీ తెలిపారు.

దొంగలు పడ్డ నాలుగు నెలలకు..

బంగారం చోరీపై ఎట్టకేలకు కేసు నమోదు

యాడికి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ఇంట్లో దొంగలు పడిన నాలుగు నెలల తరువాత ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. యాడికిలోని కమ్మవీధికి చెందిన మినుమనూరు వెంకటశివ ఇంట్లో గతేడాది డిసెంబరు 1న దొంగలు పడి, 13.5 తులాల బంగారాన్ని చోరీ చేశారు. రెండురోజులు ఆలస్యంగా చూసుకున్న బాధితుడు అప్పటి నుంచి కేసు నమోదుకు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. చోరీ విషయాన్ని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ అర్జీ ఇచ్చాడు. పోలీసులు కేసు మాత్రం నమోదు చేయలేదు. ఎట్టకేలకు నాలుగు నెలల తర్వాత బంగారం చోరీపై కేసు కట్టడం గమనార్హం. మండలంలోని పెద్దపేట గ్రామంలోని చిన్న సంజీవరాయుడు ఇంట్లో గతనెల 15న దొంగలు పడి 13.5 తులాల బంగారం చోరీ చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు చేసినా.. తొలుత పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఎట్టకేలకు 20 రోజులకు కేసు నమోదుచేయడం గమనార్హం.

పింఛన్ సొమ్ముతో ప్లానింగ్ సెక్రటరీ పరార్

సచివాలయానికి తాళం వేసిన పింఛన్‌దారులు


సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక లోనికోటలోని 14వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న హరి పింఛన్ సొమ్ముతో గురువారం ఉడాయించాడు. పింఛన్ సొమ్మును అతడు సొంతానికి వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న పింఛన్‌దారులు 14వ సచివాలయానికి తాళంవేసి, నిరసన తెలిపారు. ప్లానింగ్ సెక్రటరీ హరి ప్రతినెలా పింఛన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడుతూ.. డబ్బు ఆలస్యంగా ఇచ్చేవాడు. ఈనెల 1వ తేదీన బ్యాంకు నుంచి రూ.1.50 లక్ష డ్రా చేసి, కొంతమంది లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. మిగతావారు 1న సచివాలయం వద్దకు వెళ్లగా.. అక్కడ సమాధానం చెప్పేవారు లేరు. దీంతో వారు ఆగ్రహంతో సచివాలయానికి తాళం వేశారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ దృష్టికి సిబ్బంది గురువారం తీసుకొచ్చారు. దీంతో కమిషనర్.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా డబ్బు రికవరీ చేసి, పింఛన్‌దారులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు. సచివాలయ తాళం మాత్రం తీయకపోవడం గమనార్హం.

రైలు కిందపడి యువకుడి మృతి

తాడిపత్రి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లనూరు రోడ్డు గేట్ సమీపంలో గురువారం రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతిచెందిన వ్యక్తి వయసు 30 సంవత్సరాలు ఉంటుందనీ, నీలపురంగు చొక్కా ధరించి ఉన్నాడనీ, అతడి చేతిపై అమ్మ, ప్రసన్న, దస్తగిరి అనే పేర్లు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


గౌతమి మృతదేహం

పామిడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉప్పర నారాయణ, మస్తానమ్మ దంపతుల కుమార్తె, సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఉప్పర గౌతమి (17) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... విద్యార్థిని గౌతమి తిరుపతిలోని చంద్రగిరి ప్రభుత్వ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఓకేషనల్ పరీక్షలు ఇటీవలే రాసింది. మొదటి సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టులో ఫెయిల్ అయ్యింది. ఏప్రిల్ రెండో వారంలో పరీక్ష ఫలితాలు వస్తాయన్న సమాచారం అందినప్పటి నుంచి ఉత్తీర్ణత సాధిస్తానా..? లేదా..? అని ఆందోళనకు గురైంది. పనిమీద తల్లిదండ్రులు బయటకు వెళ్లడంతో ఇంట్లోనే ఫ్యానుకు చీరతో ఉరివేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సంతానం కలగలేదని యువకుడు..


హరీష్ మృతదేహం

గోరంట్ల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలేకుంటపల్లికి చెందిన హరీష్(30) సంతానం కలగలేదన్న మనస్తాపంతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలేకుంటపల్లి ఆదినారాయణప్ప కుమారుడు హరీష్‌కు నాలుగేళ్ల క్రితం హిందూపురం మండలం కొట్నూరు గ్రామానికి చెందిన గాయత్రితో వివాహమైంది. అప్పట్నుంచి అత్తగారింట్లోనే ఉంటుండేవాడు. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెందిన హరీష్ బుధవారం స్వగ్రామమైన కాలేకుంటపల్లికి వచ్చాడు. రాత్రికి ప్రత్యేక గదిలో నిద్రించిన అతడు పైకప్పునకు చీరతో ఉరేసుకుని, మరణించాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అతడి భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, శవాన్ని పెనుకొండకు తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


చిన్నచౌడప్ప (ఫైల్)

గార్లదిన్నె, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుంపల్లి సమీపాన 44వ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొనడంతో రైతు చిన్న చౌడప్ప (43) దుర్మరణం చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు మేరకు... పామిడి మండలం వంకరాజు కాలువకు చెందిన చిన్న చౌడప్ప, సులోచన దంపతులు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. చిన్న చౌడప్ప అనంతపురం మార్కెట్‌లో దోస, మామిడి, కలింగర తదితర పండ్లను కొనుగోలు చేసుకుని, ఆటోలో గ్రామాల్లో విక్రయించుకునేవాడు. గురువారం ఉదయం ద్విచక్రవాహనంలో అనంతపురం మార్కెట్‌కు బయలుదేరాడు. కనుంపల్లి సమీపంలోకి వెళ్లగానే ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూరుకు టైల్స్ లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చిన్న చౌడప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

న్యూస్ బాక్స్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కదిరి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో 25 మంది రౌడీషీటర్లకు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సమాజంలో మంచి ప్రవర్తనతో ఉండాలని, ఎటువంటి గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని అన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నారాయణ రెడ్డి, ఎస్ఐ బాబ్ జాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థిని ప్రతిభ


శృతికీర్తన

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఈ-అబ్యాస్ అకాడమీ వారు గతనెల 29 రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన స్కాలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్టు (ఎస్ఏటీ) పరీక్షను ఓడీసీలోనూ నిర్వహించారు. ఇందులో మండలంలోని జ్ఞానసాయి విద్యానికేతనిలో ఏడో తరగతి విద్యార్థిని శృతికీర్తన రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించినట్లు కరస్పాండెంట్ కణేకట్టి క్రిష్ణమోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 13న గుంటూరులోని వెంకటేశ్వర జ్ఞానమందిరం నిర్వహించే కార్యక్రమంలో రూ.7 వేల నగదు, మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెమెంటోను అందుకోనున్నట్లు చెప్పారు.

6న పరుగుపందెం

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో శ్రీరామనవమిని సందర్భంగా సోమవారం పరుగుపందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాలరాజు, సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరుగు పందెం రెండు కిలోమీటర్ల వరకు ఉంటుందని, దీన్ని గొట్లూరు మహంకాళమ్మ, జడ్పీ పాఠశాల నుంచి ఉదయం ఆరు గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుం లేదని స్పష్టం చేశారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5,016, రెండో బహుమతిగా రూ.3,016, మూడో బహుమతిగా రూ.2,016, నాల్గో బహుమతిగా రూ.1,016 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సెల్ 97038 32051, 63011 12051కు ఫోన్‌చేసి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి

కొత్తచెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కదిరిలో పదో తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహిస్తూ సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ గురువారం డీఈఓ కిష్టప్పకు వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లగా నియమించిన ఎంఈఓపై ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన ఏకపక్షంగా వ్యవహరిస్తూ.. అనుకూలంగా ఉన్న వారిని ఎగ్జామ్ డ్యూటి తప్పించి ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వారిపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారని డీఈఓకు ఫిర్యాదు చేశారు.

పంటల పరిశీలన


ల్యాబ్‌కు పంపేందుకు వేరుశనగ నమూనాలను సిద్ధం చేసిన అధికారులు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నల్లమాడ వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తిదారులు ద్వారా నమోదు చేసుకున్న జెర్రికుంటపల్లికి చెందిన రైతుల పొలాలను ఏఓ ఇలియాజ్ అమ్మద్, ఏఈఓ వెంకటేశ్ గురువారం పరిశీలించారు. మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధ్యమని, రసాయన ఎరువులు, పురుగు మందులు సిఫార్సు మేరకే వాడాలని రైతులకు సూచించారు. రైతులు పండించిన వేరుశనగను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. వారి వెంట సీఓ ఈశ్వరయ్య, నల్లమాడ ఏఓ శంకర్‌నాయక్, వీఏఏ శ్రావణి, రైతులు ఉన్నారు.

రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెన్నకేశవస్వామి రథోత్సవ వేడుకలను మే 10న వైభవంగా జరుపుకుందామని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఆలయ అడహక్ చైర్మన్ జగదీశ్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రథోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని పలువురు సేవా కమిటీ సభ్యులు, ప్రముఖులను కోరారు. కార్యక్రమంలో హరి, పొరాళ్లపుల్లయ్య, జింకా రామాంజినేయులు, తలారి ప్రసాద్, బండ్లపల్లి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొండకమర్ల సంత వేలం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల పంచాయతీ వారపు సంత వేలాన్ని సర్పంచ్ అల్లాపల్లి శ్రావణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆ వేలంలో ఎలేశ్వరా రూ.3.70 లక్షలకు వేలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, కార్యదర్శి మద్దిలేటిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో టీబీ పరీక్షలు


టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కదిరి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తలుపుల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశ్రీత మాట్లాడుతూ.. టీబీ ఉన్న వారి కుటుంబ సభ్యులను ముందస్తు పరీక్షల కోసం ఆసుపత్రికి పిలిపించామని చెప్పారు. ఇంజెక్షన్ వేసిన 48 గంటల్లో వాపు వస్తే టీబీ సోకినట్లు నిర్ధారణ అవుతుందని అన్నారు. అటువంటి వారికి వ్యాధికి అనుగుణంగా మందులు ఇస్తామన్నారు. ఒకవేళ టీబీ సోకకపోతే టీబీ రాకుండా నివారణ కోసం మందులు ఇస్తామన్నారు. తద్వారా టీబీ పూర్తిగా అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టీబీయూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తన్మైశ్రీ, పూజ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు గురువారం తెలిపారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ 12 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన ఈ విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అన్నీ అసంపూర్ణమే..!

- పాఠశాలలో ఆగిన అభివృద్ధి పనులు
- రూ.32 లక్షలు ఖర్చు - సామగ్రి గల్లంతు
- ప్రహరీ లేదు... మరుగుదొడ్లు పూర్తికాలేదు
- నిధులున్నా.. ఖర్చు చేయలేని పరిస్థితి
- సమస్యల్లో ధనియాన్ చెరువు జడ్పీహెచ్ఎస్
- కొత్త ప్రభుత్వం స్పందించాలని గ్రామస్థుల వినతి


అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణం

నంబులపూలకుంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్ చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉంది. ఈ పాఠశాలలో మొత్తం 76 మంది విద్యార్థులుండగా, ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాల నాడు-నేడులో రెండో విడత కింద ఎంపికైంది. నాడు ప్రారంభించిన పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ పాఠశాలలో ఏడు పాత గదులు ఉన్నాయి. అవి శిథిలావస్థలో ఉండటంతో.. వర్షం పడితే కారుతున్నాయి. అభివృద్ధి పనులకు రూ.32 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం రూ.7లక్షలకుపైగా నిధులున్నాయి. అయినా ఏ అభివృద్ధి పనీ పూర్తి కాలేదు.

● అసంపూర్తిగా పనులు

పాఠశాలకు అదనపు గదులను నాడు నేడు కింద నిధులు మంజూరు చేశారు. పిల్లర్లు వేశారు.. పునాదులు నిర్మించారు. అంతే ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. తరగతులకు గదులు లేక ల్యాబ్ గదిని సైతం వినియోగించుకోవాల్సి వస్తోంది. మరికొన్ని సమయాల్లో ఆరుబయట చెట్లకింద తరగతులను నిర్వహిస్తున్నరు. పాఠశాలకు గతంలో ముఖద్వారం, ప్రధాన గేటు ఉండేది. నాడు-నేడు నిధులు మంజూరు కావడంతో ప్రహరిని నిర్మించాలని పాత ముఖద్వారం, గేటును హడావుడిగా తొలగించారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు, కుక్కలు పాఠశాల ఆవరణంలోకి వస్తున్నాయి. విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చుట్టుపక్కల ఉంటున్న వారు పాఠశాల స్థలంలో పశుగ్రాసాన్ని నిలువ ఉంచుకొంటున్నారు. మరికొన్నిచోట్లు దాతలించిన పాఠశాల స్థల కూడా కబ్జాకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. మరుగుదొడ్లు లేక విద్యార్థినీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినీల సౌకర్యార్థం ప్రత్యేకంగా భవనం నిర్మించారేకానీ, అందులో మరుగుదొడ్ల నిర్మాణం గోడలకే పరిమితమైంది. వంటగది నిర్మించారే కాని.. తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయకపోవడంతో ఆరు బయటనే వంటను తయారు చేస్తున్నారు. నాడు-నేడు నిధులల్లో రూ.7లక్షలకుపైగా ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను నిలుపుదల చేయడంతో పనులు అసంపూర్తి ఆగిపోయాయి. ఆ పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని గ్రామస్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

● సొంత డబ్బులతో సౌకర్యాలు

గతంలో నాడు నేడు పనుల సమయంలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వెళ్లినప్పటి నుంచి సీనియర్ ఉపాధ్యాయుడు బోగాదిరెడ్డి ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. తనకు నాడు నేడు పనుల నిధుల గురించి ఏమితెలియదని, బదిలీపై వెళ్లిన సచివాలయ ఇంజనీర్, ప్రధానోపాధ్యాయుడికే ఆ వివరాలు తెలుసునని అంటున్నారు. ఎన్నికల సమయంలో పనులన్నీ ఆగిపోయాయని, అత్యవసరంగా విద్యుత్ పనుల కోసం తాను తన సొంత డబ్బు రూ.40 వేల వరకు ఖర్చు చేశానన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ ఆ నిధులు ఇస్తామని చెప్పారేగాని.. ఇంతవరకూ ఇవ్వలేదని వాపోయారు. పాఠశాలలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని, రోజూ తన సొంత డబ్బులతో విద్యార్థుల కోసం మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నానని చెప్పారు. త్వరలోనే తాను ఉద్యోగ విరమణ పొందుతానని, ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడిగా ఒక్క రూపాయి కూడా నాడు నేడు నిధులను ఖర్చు చేయలేదని అన్నారు. కాగా, ఎన్నికల సమయంలో నాడు-నేడు పనుల కోసం కొనుగోలు చేసిన కంకర, ఇసుక, ఇటుకలు, ఇనుమును ఒక ప్రాంతంలో నిలువ చేశారు. అందులో చాలా సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



పాఠశాలలో శిథిలావస్థలోన్న పాత మరుగుదొడ్లనే వినియోగించుకుంటున్నాం. నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల పనులు పూర్తి చేస్తే మాకు చాలా సౌకర్యంగా ఉంటుంది. ఒక్కోసారి ఆరుబయటకు మూత్ర విసర్జనకు వెళ్లాల్సిన దుస్థితి నెలకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మించాలి.

-మేఘన, 8వ తరగతి విద్యార్థిని

నిధులు నిలుపుదల

నాడు-నేడు పనుల నిధులను ప్రస్తుత ప్రభుత్వం నిలుపుదల చేసింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఆగిపోయిన పనులు పూర్తి చేస్తాం.

- సుబ్బిరెడ్డి, ఎంఈఓ, నంబులపూలకుంట




అసంపూర్తిగా అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పాఠశాల ఆవరణలో నిల్వ చేసిన గ్రాసం

ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తచెరువు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో ఎంట్రప్రైన్యూర్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎనిమిది ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉప్పలపాడు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రవల్లి రూపొందించిన సోలార్ బెస్టు మల్టీపర్పస్ పార్మింగ్ మిషన్, కుటాగుళ్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అనిష్, రతీఫ్‌ఖాన్, ఫైజాన్ రూపొందించిన యాంటి స్లీప్ అలారం, ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రీష్మ, పావని, బేబీ రూపొందించి బయో డిగ్రడబుల్ ప్రొడెక్ట్‌లు ఉత్తమ ఆవిష్కరణలుగా ఎంపికయ్యాయి. డైట్ అధ్యాపకులు గోవిందరాజులు, రాధిక న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఇందులో డీఈఓ కిష్టప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌సెంటర్ క్యూరేటర్ తనూజ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాన రాకతో ఉపశమనం


చిగిచెర్లలో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఎండవేడిమి నుంచి అల్లాడుతున్న ప్రజలు.. గురువారం కురిసిన వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రం నుంచి సుమారు రెండుగంటల పాటు మండలవ్యాప్తంగా వాన దంచికొట్టింది. దీంతో గ్రామాల్లో రోడ్లపై వర్షపు నీరు పారింది.

హైకోర్టు ఉత్తర్వులతో పింఛన్ చెల్లింపు

రూ.1.75 లక్షలు మంజూరు

తాడిమర్రి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేసిన సామాజిక భద్రతా పింఛన్‌ను పునరుద్ధరించి, అప్పటి నుంచి ఇప్పటిదాకా బకాయిపడ్డ మొత్తం పింఛన్‌ను లబ్ధిదారుడికి చెల్లించారు. వైసీపీ ప్రభుత్వం 2019లో ఏర్పడగానే మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన కొండన్నగారి నాగరాజుకు వస్తున్న చేనేత పింఛన్‌ను రద్దు చేశారు. ఈయన ఆ గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడిగా ఉండటంతో నాయకుల ఒత్తిడి మేరకే అప్పట్లో అధికారులు తొలగించారు. నాగరాజు 2023లో హైకోర్టుకు వెళ్లగా 2024 డిసెంబరులో పింఛన్ పునరుద్ధరించడంతోపాటు మొత్తం డబ్బు చెల్లించాలని అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో రూ.1,75,750 విలువ గల చెక్కును గురువారం సాయంత్రం ఎంపీడీఓ రంగారావు నాగరాజుకు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, నాయకులు హర్ష, పక్కీర్‌రెడ్డి, పాపానాయుడు, రవీంద్రరెడ్డి, భాస్కర్‌గౌడ్, పంచా యతీ కార్యదర్శి నారాయణస్వామి పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎంపీడీఓ

అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి


అంగన్‌వాడీ భవనం

గాండ్లపెంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెల గల పంచాయతీలో అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తి అయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భవన నిర్మాణం ఆగిపోయింది. దీంతో అంగన్‌వాడీ భవనం లేక అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ భవనం పూర్తి చేసినట్లు మాజీ సర్పంచ్ ప్రసాద్ తెలిపారు .త్వరలో ఎమ్మెల్యే దీన్ని ప్రారంభిస్తారన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి


ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

కదిరిఅర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకుల వాండ్లపల్లి వద్ద ఉన్న హరీష్ పాఠశాలలో గురువారం ఛత్రపతి శివాజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ ఎంఎస్ కిరణ్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ ఎంపిక


బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ధర్మవరం బార్ అసోషియేషన్ నూతన కమిటీని సీనియర్, జూనియర్ న్యాయవాదులు గురువారం ఎంపిక చేశారు. బార్‌అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎంఏ ఖరీమ్, ప్రధాన కార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడిగా నూర్‌అహమ్మద్, సహాయకార్యదర్శిగా బాలసుందరీ, కోశాధికారిగా అబ్దుల్‌సాబ్, కమిటీ సభ్యులుగా కేఎం రేష్మ, శివకుమాఆర్, మోహన్‌దాసు, నరసింహమూర్తి, పెద్దన్న, బాబాఫక్రుద్దీదన్, మణికంఠ, ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అయితే ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయవాదులు డీఎల్ఎన్ మూర్తి, చంద్రమౌళి పోటీ పడ్డారు. దీనికి నిర్వహించిన ఎన్నికల్లో డీఎల్ఎన్‌మూర్తి 36, చంద్రమౌళికి 31 ఓట్లు వచ్చాయి. దీంతో డీఎల్ఎన్‌మూర్తి ఐదు ఓట్ల తేడా గెలుపొందారు. ప్రధానకార్యదర్శిగా డీఎల్ఎన్ మూర్తిని ఎంపికచేశారు.

చలో విజయవాడకు అనుమతివ్వండి

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల పదో తేదీన నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడానికి తమకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను విజ్ఞప్తి చేశారు. గురువారం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇందులో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సీఐటీయూ మండల కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ముకుంద, లక్ష్మీఓబుళేశు, నాయకులు చెన్నకేశవులు, ప్రసాద్, ఓబుళప్ప పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు, కార్మికులు

క్రైం న్యూస్..

మహిళపై హత్యాయత్నం

నల్లమాడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాల గ్రామానికి చెందిన లక్ష్మీదేవిపై ఆమె తమ్ముడు రామచంద్ర, బంధువులు గురువారం హత్యాయత్నం చేశారు. బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు.. లక్ష్మీదేవికి ఆమె తమ్ముడు రామచంద్రకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. అవి మనసులో పెట్టుకుని బంధువులు శ్రీనివాసులు, మురళి, అనిల్ సహకారంతో రామచంద్ర ఇంట్లో ఉన్న లక్ష్మీదేవిపై కత్తితో దాడి చేశాడు. దీంతో లక్ష్మీదేవి గొంతు, తొడలు, కాళ్లపైన తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ నరేంద్రరెడ్డి సంఘటన స్థలానికెళ్లి గాయపడిన ఆమెను 108 ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు రామచంద్ర, శ్రీనివాసులు, మురళి, అనిల్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

డ్రిప్‌వైర్ చోరీ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు గ్రామానికి చెందిన సిద్ధాచంద్ర పొలంలో రెండు ఎకరాల డ్రిప్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీ చేశారు. రెండు ఎకరాలల్లో సాగు చేస్తున్న టమోట పంటకు నీరు అందించడానికి డ్రిప్ వైర్ ఏర్పాటు చేశాడు. ఆ డ్రిప్ చోరీ చోరీకి గురైందని, గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధిత రైతు సిద్ధాచంద్ర వాపోయాడు. దీంతో తనకు రూ. 50వేలు నష్టం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తనకల్లు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగసానిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా వాసి తీవ్రంగా గాయపడ్డాడు. అన్నమయ్య జిల్లా కందుకూరు సమీపంలోని అగ్రహారం గ్రామానికి చెందిన ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కదిరికి వెళ్లారు. కదిరి నుంచి కారులో స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రసాద్ తలకు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ప్రసాద్ బంధువు సాయిక్రిష్ణ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రసాద్ భార్య, ముగ్గురు పిల్లలకు గాయాలు కాలేదు. స్థానికులు గాయపడిన వారిని 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరికి తరలించారు.

భర్తపై కేసు నమోదు

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తనను మానసికంగా వేధిస్తున్నాడని ఇందిరమ్మ కాలనీకి చెందిన మునిమడుగు మీనా తన భర్త క్రాంతిపై గురువారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. క్రాంతి మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా.. నిత్యం భార్యను మానసికంగా వేధిస్తున్నాడని, వాటిని భరించలేక ఆమె ఫిర్యాదు చేసిందని తెలిపారు.


అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

అనుమానితుల ఇళ్లలో సోదాలు

ధర్మవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ, వైఎస్ఆర్, కేతిరెడ్డికాలనీలతో పాటు ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4 కాలనీల్లో అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ఇళ్లతో పాటు చుట్టు ప్రక్కల సోదాలు నిర్వహించారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.... ఎవరైనా అనుమానితులు కాలనీల్లో తిరిగితే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

నేడు జగ్జీవన్ రామ్ జయంతి

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను జిల్లాకేంద్రంలోని సాయిఆరామం ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ సంచాలకుడు శివరంగప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొంటారని, ఇందులో ప్రజాప్రతినిధులు, జిల్లాలోని దళితసంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీసభ్యులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అలసత్వమా..? ఒత్తిళ్లా..?

వరుస ఘటనలతో సోమందేపల్లిలో భయం... భయం

చర్యలు తీసుకోవడంలో పోలీసుల మీనమేషాలు



సోమందేపల్లి పోలీస్‌స్టేషన్

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఆ మండలంలో జరుగుతున్న వరుస ఘటనలతో ఓ వైపు పోలీసులు, మరోవైపు జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎందుకిలా జరుగుతుందంటూ మదనపడుతున్నారు. ఆ సబ్‌డివిజన్‌లో ఎక్కడా లేని విధంగా సోమందేపల్లి మండలంలో వరుస ఘటనలు చోటుచేసుకోవడంపై పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇక్కడ జరిగే చిన్నవిషయం చిలికి చిలికి గాలివానగా మారి పెద్ద సంఘటనలకు దారితీస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారా లేక ఒత్తిళ్లు ఉన్నాయా అన్నది వారికే ఎరుక. ఈ పరిస్థితుల్లో మండలంలో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో జనం బెంబేలెత్తుతున్నారు.

వరుస ఘటనలతో ఉక్కిరి బిక్కిరి

కొన్ని నెలల క్రితం ఇదే మండల పరిధిలోని జాతీయ రహదారిలో మండల కేంద్రానికి సమీపంలో కారులో వెళ్తున్న వారిపై గుర్తుతెలియని దుండగులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో పెనుకొండకు చెందిన కొంతమంది గాయపడ్డారు. రెండు నెలల క్రితం ఇదే స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటోను ఆపి అందులో ప్రయాణికులను చితకబాది వారి వద్ద ఉన్న నగదును ఎత్తుకెళ్లారు. అయినా వారు పోలీసులను ఆశ్రయించలేదు. వారం రోజులుగా మండల కేంద్రంలో చోటుచేసుకున్న సంఘటనలు పరిశీలిస్తే ఉగాది పండగ సందర్భంగా గీతానగర్‌లో మత్తులో ఉన్నవారు గొడవపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడిచేసి అతని ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులపై కూడా దాడికి యత్నించారు. సోమవారం చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం సందర్భంగా మార్కెట్ రోడ్డువద్ద నాటకం ఆడుతున్న సమయంలో మద్యం మత్తులో ఉన్న యువకులు కత్తులతో దాడులు చేసుకున్నారు. దీంతో నితీష్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో యువకుడికి చేతివేళ్లకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం రాత్రి సోమందేపల్లి చెరువు సమీపంలో పందులు అపహరించడానికి వచ్చిన దొంగలు బీభత్సం సృష్టించారు. అక్కడున్న పందుల కాపరులపై రాళ్లదాడిచేశారు. దీంతో ఆ పక్కనే ఉన్న హోటల్ యజమానికి తీవ్రగాయాలయ్యాయి. రెండు నెలల వ్యవధిలో నాలుగైదు సార్లు పందులు అపహరించుకెళ్లారు. బుధవారం రాత్రి పోలేపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇవి మచ్చుకకు మాత్రమే. ఇలాంటి సంఘటనలు మండలంలో చాలా జరుగుతున్నాయని పోలీసులే పేర్కొనడం విశేషం. అదేవిధంగా పల్లెల్లో, మండల కేంద్రంలో కొద్దిరోజులుగా పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. అలాగే మూడు రోజుల క్రితం మండల కేంద్రంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఒకరు మృతిచెందారు. దీంతో ఉన్నతాధికారులు సైతం ఎందుకు ఇలా ఆ ప్రాంతంలో జరుగుతోందని ఆరా తీసినట్లు తెలిసింది.

చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు..

ఇన్ని సంఘటనలు జరుగుతున్నా స్థానిక పోలీసులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని జనం గగ్గోలు పెడుతున్నారు. స్థానిక పోలీసు అధికారులుకానీ జిల్లా అధికారులు కానీ స్పందించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ఒకటి రెండు సంఘటనలు జరిగితే ఆ ప్రాంతాన్ని ఎస్పీ, డీఎస్పీలు పర్యవేక్షిస్తారు. కానీ ఈ మండలంలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం ఏంటని అంటున్నారు. పోలీసు అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. అంతేకాక స్థానిక పోలీసు అధికారితోపాటు సిబ్బంది ఇంత జరుగుతున్నా అరికట్టడంలో ఎందుకు విఫలం అవుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వారికి ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందా లేక రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లోనవుతున్నారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో మండలంలోని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలు చోటుచేసుకుంటుండటంతో ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది.

ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశాం : రాఘవన్, సీఐ, పెనుకొండ

సోమందేపల్లిలో జరుగుతున్న సంఘటనలు ఒకదానికి మరొకదానికి లింకులు లేవు. అనుకోకుండా జరుగుతున్న సంఘటనలే. అయినా వాటిని నియంత్రించేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. రాత్రిపూట బీట్‌లు పెంచాం. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికి అసాంఘిక శక్తులను గుర్తించే పనుల్లో ఉన్నాం. అలాంటివారు ఎవరైనా తోకజాడిస్తే వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు పెట్టడానికి సిఫార్సు చేస్తాం. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడం.

పందుల అపహరణపై ఫిర్యాదు

సోమందేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లగొంద్రాయనపల్లి సమీపంలో సోమందేపల్లి చెరువు వద్ద మారెమ్మ గుడివెనుక పందులను చోరీచేసిన దొంగలు పక్కనే ఉన్న టీస్టాల్ యజమానిపై రాళ్లదాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. మారెమ్మ గుడివెనుక సోమందేపల్లి శివానగర్‌కు చెందిన రవి 70 పందులు మేపుకుంటూ రాత్రివేళల్లో అక్కడే నిద్రిస్తుంటాడు. ఈ నేపథ్యంలో బొలెరోలో వచ్చిన ఆరుగురు దొంగలు నాలుగు పందులు దొంగలించి తీసుకెళ్తుండగా తోటి కాపరులతో కలిసి బండిని రవి వెంబడించాడు. అయితే దొంగలు రాళ్లు రువ్వడంతో నల్లొంద్రాయనపల్లి జాతీయరహదారిపక్కన ఉన్న టీస్టాల్ యజమాని జక్కారవికి తీవ్ర గాయలయ్యాయి. ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించారు. గురువారం పందుల యజమాని రవి, జక్కారవిభార్య కళ్యాణి స్థానిక పోలీస్ స్టేషన్‌లో పందుల చోరీ, దాడిపై ఫిర్యాదుచేశారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో నాలుగుసార్లు పందుల చోరీ జరిగిందని, దాదాపు 80 పందులను ఎత్తుకెళ్లడం జరిగిందని రవి పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. తన భర్త జక్కారవికి తీవ్రగాయాలయ్యాయని, బళ్లారిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు న్యాయం చేయాలని కళ్యాణి కోరింది.

దాడులకు పాల్పడితే చర్యలు: ఎస్ఐ

గంజాయి, మద్యం సేవించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. యువకుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇన్నాళ్లు సంయమనం పాటిస్తూ కౌన్సిలింగ్ ఇచ్చామని, ఇకపై ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఆదివారం రాత్రి గీతానగర్‌లో ముగ్గురు యువకులు మద్యం మత్తులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వేణుగోపాల్‌పై దాడిచేసి, అతని కుటుంబ సభ్యులను కొట్టారన్నారు. ఈ ఘటనలో తేజు, విజయ్‌కుమార్, కిరణ్‌లపై కేసునమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పార్కింగ్‌కు అడ్డాగా ప్రభుత్వ ఆసుపత్రి

వాహనాలను ఆవరణంలో నిలిపి ఇతర ప్రాంతాలకు

రోగులకు ఇబ్బందిగా వాహనాల పార్కింగ్

108 వాహనాలు వెళ్లేందుకు చోటేదీ..?

కనిపించని సెక్యూరిటీ


వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేసిన దృశ్యం


మెట్ల వద్ద పెద్దఎత్తున వాహనాల పార్కింగ్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన పెనుకొండలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఆసుపత్రిలోకి 108 వాహనం రావాలన్నా ద్విచక్రవాహనాల పార్కింగ్ సమస్యగా ఉంటోంది. నో పార్కింగ్ బోర్డు ఉన్నా అక్కడే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. యథేచ్ఛగా పార్కింగ్‌చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

కనిపించని సెక్యూరిటీ సిబ్బంది

ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్ కనిపించరు. వారు విధులకు వస్తున్నా ఆసుపత్రిలోనే ఇతర పనులకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఆసుపత్రి ఆవరణంలో వాహనాలను యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ పార్కింగ్‌చేసి పరిసర ప్రాంతాల్లో పనులు ముగించుకుని తరువాత వాహనాల్లో సొంత ప్రాంతాలకు వెళ్లిపోవడం కనిపిస్తోంది. మరికొందరు పర్మనెంట్‌గా ఆసుపత్రి పైకి వెళ్లే మెట్ల కింద వాహనాలు నిలిపి ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం నిమిత్తం వెళ్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఆసుపత్రి సిబ్బంది, కమిటీ సభ్యులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఓపీకి వచ్చే ప్రధాన ద్వారం వద్ద వాహనాలను పార్కింగ్ చేయకూడదని బోర్డులు పెట్టాం. అయినా వాహనాలను అడ్డుదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డ్‌తో ఆసుపత్రికి వచ్చే వాహనాలను బయట పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం. అత్యవసరంగా వచ్చే రోగులకు ఇబ్బందులు పెట్టం.

-శివప్రసాద్‌నాయక్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

నేడు పెనుకొండ, రొద్దంలో మంత్రి పర్యటన

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత శుక్రవారం పెనుకొండ, రొద్దం మండలాల్లో జరగనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు మండల కన్వీనర్ సిద్దయ్య గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు మండలంలోని నాగలూరులో రూ.1.05కోట్లతో సీసీరోడ్డును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు రొద్దం మండలం నల్లూరులో పెన్నానదిపై రూ.2.80కోట్లతో కాజ్వే నిర్మాణానికి భూమిపూజ, 2గంటలకు ఆర్. కొట్టాల నుండి దొడగట్ట వరకు రూ.1.30కోట్లతో సీసీ రోడ్డుకు భూమిపూజ, సాయంత్రం 4.30కు తురకలాపట్నం చెరువుకు జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

వైద్యుడి బారి నుంచి ఆస్పత్రిని కాపాడండి

రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

పావగడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో టీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్‌ను బాధ్యతల నుంచి తొలగించి ప్రభుత్వ ఆసుపత్రిని కాపాడాలని రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ కోరారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 14 మంది వైద్యులు ఉండగా నలుగురితో మాత్రమే వైద్యం చేయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతో పేదప్రజలు సైతం వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఏ వైద్యులు ఆసుపత్రికి వచ్చినా కిరణ్ వల్ల వైద్యవృత్తిని నిర్వర్తించేందుకు ఆసక్తి చూపడంలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ స్పందించి ఇక్కడ జరుగుతున్న వ్యవహారాన్ని తెలుసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీకి పెరిగిన ఆదాయం



వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్

పావగడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వాణిజ్య దుకాణాలకు గురువారం జరిగిన వేలంతో ఆదాయం పెరిగింది. గడిచిన 25ఏళ్ల నుంచి రూ.800 నుంచి రూ.1000 దాకా అద్దె రూపంలో అందిస్తున్న వాణిజ్య దుకాణాలకు వేలం పాట నిర్వహించారు. రూ.15నుంచి రూ.18వేల వరకు వేలం పాడటంతో మున్సిపాలిటీకి రూ.19లక్షల వరకు ఆదాయం చేకూరినట్లు మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్ తెలిపారు. నూతన బస్టాండులోని 122 వాణిజ్య దుకాణాలను వేలంపాటలో వ్యాపారస్థులు దక్కించుకున్నారు. ఈ వేలంపాటు 12సంవత్సరాల వరకు కేటాయించిన దుకాణాలకు చెల్లించిన అడ్వాన్స్ నగదును 12సంవత్సరాల తరువాత తిరిగి పొందవచ్చని ఆయన తెలిపారు. ఇంతవరకు మూడు నుంచి నాలుగు లక్షల వరకు అద్దె రూపంలో వస్తున్న దుకాణాలకు నేడు రూ.19లక్షలు ఆదాయం చేకూరడంతో వ్యాపారస్థులను ఇటు మునిసిపల్ కార్యాలయానికి ఆదాయం చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారి జాఫర్ షరీఫ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫాంపాండ్లు తవ్వుకోవాలి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పొలాలున్న ప్రతి రైతు ఫాంపాండ్లను తవ్వుకోవాలని మాజీ ఎంపీపీ మునిమడుగు వెంకటరాముడు సూచించారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని మునిమడుగు గ్రామంలో కియా అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ చెక్‌డ్యామ్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దారి ఇవ్వాలని వినతి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న తిమ్మాడపల్లి గ్రామస్థులు

చిలమత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంతో తమ పొలాలకు వేళ్లేందుకు దారిలేకుండా పోతోందని, సమస్యను అర్థం చేసుకొని దారి చూపాలని మండలంలోని తిమ్మాడపల్లి గ్రామస్థులు గురువారం డీటీ జగన్నాథని కోరారు. గతంలో రోడ్డు నిర్మాణ పనులు గ్రామస్థులు అడ్డుకోవడంతో దీనిపై జేసీ అభిషేక్‌కుమార్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్థులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన హామీ ఇచ్చారని, అయితే ఇప్పుడు ఏకంగా పోలీసులను బందోబస్తుగా పెట్టుకొని రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని గ్రామస్థులు ఆయన ఎదుట వాపోయారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే భవిష్యత్తులో తాము పొలాలకు వెళ్లేందుకు దారి ఉండదని, భూములు ఉన్నా వాటిలో పంటలను సాగుచేసుకోలేమన్నారు. ఇప్పటికైనా పొలాలకు వేళ్లేందుకు గ్రీన్ ఫీల్డ్ హైవే అధికారులు స్పందించి వెంటనే దారి చూపాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు రైతు కార్మిక సంఘం నాయకులు ప్రవీణ్ తదితరులు మద్దతు తెలిపారు.

త్వరలో రోడ్డు పనులు


సర్వే చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. కొండాపురం, మంగాపురం, కోనాపురం గ్రామాల్లో డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థులు గుంతలమయమైన రోడ్డుతో ఇబ్బంది పడేవారు. మంత్రి సవిత రూ. 50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో గురువారం రోడ్డు కొలతలను అధికారులు తీసుకున్నారు. మరో వారంలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని నగర పంచాయతీ అధికారులు తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న టీచర్లు

చిలమత్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ అండ్ టెక్నాలజీ పోటీల్లో మండలంలోని టేకులోడు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. పాఠశాలకు చెందిన రక్షిత, జ్యోత్స్న, ప్రశాంతి సైన్స్ అండ్ టెక్నాలజీలో, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ విజ్ఞానంలో వైష్ణవి, జోషిత, హాషిని జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గురువారం వారిని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పోటీల్లో మరింత ప్రతిభ కనపరిచి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయురాలు నీరజ, అరుణ, లావణ్య, రామతులసీ, షేక్ టీటీ, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు అలీముల్లా, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి హిందూపురానికి అక్రమంగా తీసుకొస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. గురువారం తూమకుంట చెక్‌పోస్టువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అంబేద్కర్‌నగర్‌కు చెందిన ప్రసాద్‌వర్మ మూడు కేసుల మద్యం ద్విచక్రవాహనంలో తీసుకొస్తుండగా పట్టుకుని మద్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు సత్యానారాయణ, పృథ్వీ, ఫారూక్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

మడకశిరటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం డిపో ముందు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లను ఆపాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులను తిరిగి కల్పించాలని డిమాండ్ చేశారు. నైట్ అవుట్ అలవెన్సులు పెంచాలని కోరారు.

యాదవులకు సీఎం అండ

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): యాదవ కులస్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని, వారి సంక్షేమానికి కృషిచేస్తారని కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన స్వగృహంలో పలువురు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కేశవయ్య మాట్లాడుతూ.. యాదవుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక రుణాలు వచ్చేలా సీఎం, స్థానిక మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

శాంతి కమిటీ సమావేశంలో అధికారులు


సమావేశంలో మున్సిపల్ కమిషనర్, చైర్మన్

హిందూపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని జరిగే సూగూరు ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం ప్రశాంతంగా నిర్వహిద్దామని మునిసిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం తహసీల్దార్ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, డీటీ మైనుద్దీన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్రహ్మరథోత్సవ నిర్వహణకు అందరూ సమకరించాలన్నారు. హిందూపురమంటే సర్వమత సమ్మేళనానికి ప్రతీక అని అన్నారు. ఇక్కడ వివిధ మతాలు, కులాలున్నా ఏ కార్యక్రమమైనా కలిసికట్టుగా చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. శ్రీరామనవమి పండగ రోజు జరిగే బ్రహ్మరథోత్సవంతోపాటు ఉట్లమానును జయప్రదం చేయాలని కోరారు. పోలీసు అధికారులు పండగ సందర్భంగా ప్రజలకు సహకరించాలని అదే సమయంలో ప్రజలు కూడా వారికి సహకరించాలని కోరారు.

పగిలిన శ్రీరామిరెడ్డి తాగునీటి పైప్‌లైన్

వృథా అవుతున్న నీరు... పట్టించుకోని అధికారులు


పైప్‌లైన్ పగిలి వృథా అవుతున్న నీరు

అమరాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కెంకెర గ్రామం వద్ద శ్రీరామరెడ్డి తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరు వృథా అవుతోంది. నీటి వృథాపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా హనుమంతనపల్లి సమీపంలో మడకశిర మెయిన్‌రోడ్డు పక్కనే ఏడాది నుంచి శ్రీరామరెడ్డి తాగునీటి పైప్‌లైన్ పగలడంతో అప్పటి నుంచి నీరు వృథాగా వంకలో పారుతోంది. అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదు. వెంటనే సంబంధిత అధికారులు నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరారు.

హైవే పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న గుండుమల

అగళి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొడికొండ చెక్‌పోస్టు నుంచి అగళి మీదుగా శిర హైవే పనులను గురువారం రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడికొండ నుంచి అగళి మండలంలోని పి. బ్యాడిగెర వరకు హైవే పనులు పూర్తయ్యాయని, కర్ణాటక ప్రాంతమైన శిర వరకు పనులు జరగాల్సి ఉందన్నారు. కర్ణాటక రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హైవే పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ ఉమేష్, రొళ్ల కన్వీనర్ దాస్ రెడ్డి, వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, ఈరన్న, భరత్, రామక్రిష్ణ, రాజన్న, జయన్న ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు


బీటీ రోడ్డుకు కొలతలు వేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్

అగళి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామనపల్లి నుంచి భైలాంజనేయస్వామి గుడి వరకు రూ.కోటితో బీటీ రోడ్డు మంజూరు అయిందని అసిస్టెంట్ ఇంజనీర్ అభిజిత్ తెలిపారు. గురువారం బీటీ రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. బీటీ రోడ్డుకు రూ.కోటి మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి గ్రామస్థులు డాక్టర్ కిష్టప్ప, ఆచారి శ్రీనివాస్, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగమాకులపల్లివద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు వెలగమాకులపల్లికి రాగానే సాంకేతిక లోపం కారణంగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.